క్లుప్తంగా

పర్యావరణాన్ని కాపాడుకుందాం



చిన్నారులతో కలిసి మొక్క నాటుతున్న ఎఫ్‌ఆర్‌ఒ తేజఅశ్విని

ఆదోని సెంట్రల్: మొక్కలను నాటి పర్యావరణాన్ని కాపాడుకుందామని ఆదోని ఫారెస్టు రేంజ్ అధికారి తేజఅశ్విని తెలిపారు. గురువారం పట్టణంలోని భాష్యం పాఠశాల ఆవరణలో వనమహోత్సవ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరై ఆమె మాట్లాడారు. చెట్లు తక్కువ కావడం వల్లే వాతవరణం కలుషితమైందని, రుతుపవనాలు గతి తప్పాయని చెప్పారు. ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి పచ్చదనాన్ని పెంపొందించాలని కోరారు. ట్రైనింగ్ పూర్తి చేసుకొని బాధ్యతలు చేపట్టిన ఆమెను పాఠశాల సిబ్బంది సన్మానించారు. వైస్ ప్రిన్సిపాల్ అంజి, హెచ్‌ఎం వాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ గడువు పొడిగింపు

ఆదోని సెంట్రల్: డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి ఈ నెల 12వ తేదీ వరకు గడువు పొడిగించారని స్థానిక డిగ్రీ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ మహబూబ్ బాషా గురువారం తెలిపారు. కళాశాలలో సింగల్ మేజర్ సబ్జెక్టు ప్రోగ్రాం కింద బీఏ ఎకనామిక్స్, బీకాం కామర్స్, బీఎస్సీ బోటనీ కోర్సులు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. నమోదు చేసుకున్నవారు ఈ నెల 15 నుంచి 19వ తేదీ లోపు వెబ్ ఆప్షన్స్‌లో కళాశాలను సెలెక్టు చేసుకోవాలని సూచించారు. ఎంచుకున్న కళాశాలలో కోర్సులు, సీట్లను బట్టి 24న కళాశాలల అలాట్‌మెంట్ జరుగుతుందని వివరించారు.

నీటిని వృథా చేయొద్దు

ఆదోని టౌన్ : వర్షాలు కురవకపోవడంతో బసాపురం ఎస్ఎస్ ట్యాంకు, రాంజల నల్లచెరువులోని నిల్వ ఉన్న అడుగంటిపోతున్నాయని, దీంతో నీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవాలని మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి పట్టణ ప్రజలకు సూచించారు. గురువారం బసాపురం ఎస్ఎస్ ట్యాంకును ఆయన ఎంఈ నాగభూషణ్‌రెడ్డి, ఏఈలతో కలిసి పరిశీలించారు. చెరువులో నీటి లభ్యత లేని కారణంగా నీటి సమస్య ఏర్పడే అవకాశం ఉందని, భవిష్యత్ దృష్ట్యా నీటిని పొదుపుగా వాడుకొని సహకరించాలని కోరారు.

పండ్ల తోటల పెంపకానికి ప్రభుత్వ తోడ్పాటు



రైతులకు మొక్కలు పంపిణీ చేస్తున్న అధికారులు

ఆదోని రూరల్ : చిన్న, సన్నకారు రైతుల పండ్ల తోటల పెంపకానికి ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని ఎంపీడీఓ గీతావాణి తెలిపారు. గురువారం సాయంత్రం స్థానిక ఉపాధి హామీ కార్యాలయం వద్ద మండలంలోని 35 గ్రామ పంచాయతీలకు సంబంధించి 86 మంది రైతులకు చెందిన 111 ఎకరాల్లో 8 వేల కొబ్బరి మొక్కలను పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం కింద పంపిణీ చేసిన ఈ మొక్కలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఏపీఓ చంద్రశేఖర్, ఈసీ, టెక్నికల్ అసిస్టెంట్లు, రైతులు పాల్గొన్నారు.

ఖాదర్‌లింగ స్వామికి ప్రత్యేక ఫాతెహాలు



పూజల్లో పాల్గొన్న భక్తులు

కౌతాళం: స్థానిక జగద్గురు ఖాదర్‌లింగ స్వామి దర్గాకు గురువారం భక్తులు అధికంగా తరలివచ్చి భక్తి శ్రద్ధలతో ప్రత్యేక ఫాతెహాలు సమర్పించారు. భక్తుల రాకతో దర్గా పరిసరాలు సందడిగా మారాయి. తెల్లవారుజామున ఐదు గంటలకు దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా చిష్టీ,పీఠాధిపతి ఖాదర్‌బాషా చిష్టీ స్వామి సమాధికి గంధం పూసి ప్రత్యేక ఫాతెహాలను చేపట్టారు. భక్తులకు దర్గాలో అన్నదానం ఏర్పాటు చేశారు.

వ్యాపారులు ముందుకు రావాలి

మంత్రాలయం రూరల్: మంత్రాలయంలో భక్తుల సేవకు మరింత మంది వ్యాపారులు ముందుకు రావాలని, అప్పుడే అన్ని సౌకర్యాలు సమకూరుతాయని, వీటితో పాటు ఉపాధి లభిస్తుందని వైఎస్సార్‌సీపీ నాయకుడు వై.సీతారామిరెడ్డి పేర్కొన్నారు. గురువారం మంత్రాలయంలో కొత్తగా నిర్మించిన గోకుల్ హోటల్‌ను ప్రారంభించారు. అంతకముందు గ్రామదేవత మంచాలమ్మ, రాఘవేంద్రస్వామి మూల బృందావనాన్ని దర్శించుకున్నారు. ఆయన మాట్లాడుతూ ఇటీవల మంత్రాలయానికి భక్తుల తాకిడి పెరిగిందని, దీన్ని దృష్టిలో ఉంచుకొని భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగనివ్వకుండా అందరూ సహకరించాలని కోరారు.

జగనన్న సురక్షతో అర్హులకు పథకాలు



మహిళకు పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి



పెద్దహరివాణంలో సర్టిఫికెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

- ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి
- పెద్దహరివాణంలో 'జగనన్న సురక్ష', 'గడప గడపకు మన ప్రభుత్వం'

ఆదోని రూరల్ : జగనన్న సురక్ష కార్యక్రమంతో గ్రామాల్లోని ప్రజలకు స్థానికంగానే ధ్రువ పత్రాలు అందజేసి పథఖాలు వర్తించేలా చర్యలు చేపట్టడం హర్షణీయమని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండలంలోని పెద్దహరివాణం గ్రామ సచివాలయం-1 వద్ద జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 1,223 మందికి ధ్రువ పత్రాలు అందజేశారు.

అమ్మ ఒడి చెక్కును విడుదల..

గ్రామంలోని జెడ్పీ పాఠశాల ఆవరణలో గ్రామానికి చెందిన విద్యార్థులకు అమ్మ ఒడి పథకం కింద మంజూరైన రూ.1.10 కోట్లు చెక్కును, అలాగే మండలంలో మొత్తం 29 వేల మందికి విద్యార్థుల తల్లులకు సంబంధించి రూ.3,84,35,000 చెక్కును విడుదల చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థుల సంక్షేమానికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందన్నారు.

గడప గడపకు మన ప్రభుత్వంతో సమస్యల పరిష్కారం

గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంతో ప్రజా సమస్యలు పరిష్కారమవుతాయని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం నాలుగో రోజు గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరిగి ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలపై ఆరా తీశారు. ఆయన మాట్లాడుతూ ఇచ్చిన హామీల్లో 95 శాతం అమలు చేసి నూతన చరిత్రకు నాంది పలికారన్నారు. ఇంకా ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ కామాక్షి తిమ్మప్ప, ఎంపీపీ బడాయి దా నమ్మ, వైస్ ఎంపీపీ పుష్పలత, మాజీ ఎంపీపీ పంపాపతి, తహసీల్దార్ వెంకటలక్ష్మి, డిప్యూటీ తహసీల్దార్ రజనీకాంత్‌రెడ్డి, ఆర్‌ఐ జయరామిరెడ్డి, ఎంపీడీఓ గీతావాణి, ఎంఈఓ శివరాములు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నాగమల్లయ్య, పీఆర్ ఏఈ మాలిక్‌బాషా, ఏపీఎం జనార్దన్, ఏపీఓ చంద్రశేఖర్, నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, మెడికల్ నాగరాజు, వీరేష్, గోవర్ధన్‌రెడ్డి, సంతోష్, గోపాల్‌రెడ్డి, మారెప్ప, లింగన్న, భాగ్యప్ప, శ్రీలక్ష్మి, రేణుక, కల్పవల్లి, సర్పంచ్ రాముడు, వైస్ సర్పంచ్ మల్లికార్జునరెడ్డి పాల్గొన్నారు.

పెద్దకడబూరు: పరిష్కారం కాని సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని గవిగట్టు గ్రామంలో సర్పంచ్ నాగరాజు ఆధ్వర్యంలో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. మొత్తం 190 మందికి వివిధ రకాల ధ్రువ పత్రాలను అందజేశారు. ఆర్‌ఐ మహేష్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇళ్ల స్థలాలు



లబ్ధిదారులకు ధ్రువ పత్రాలు అందజేస్తున్న నాయకులు, అధికారులు



చూడి గ్రామంలో ధ్రువ పత్రాలు అందజేస్తున్న ప్రదీప్‌రెడ్డి, నాయకులు

మంత్రాలయం: అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి సహకారంతో ఇళ్ల స్థలాలు కేటాయిస్తామని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ భీమిరెడ్డి తెలిపారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్ విశ్వనాథ్‌రెడ్డితో కలిసి జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా లబ్ధిదారులకు ధ్రువ పత్రాలు పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ.. మత్రాలయంలో ఇళ్ల స్థలాల సమస్య ఉందని, అందరికీ ఇళ్ల స్థలాలు కావాలంటే మరో 20 ఎకరాల భూమి కొనుగోలు చేయాల్సివస్తుందన్నారు. ఇప్పటికే సమస్యను ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి ఎమ్మెల్యే తీసుకెళ్లారని చెప్పారు. ప్రభుత్వం నుంచి అనుమతులు రాగానే ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తామని హామీనిచ్చారు. సర్పంచ్ తెల్లబండ్ల భీమయ్య, ఎంపీడీఓ మణిమంజరి, ఎస్ఐ వేణుగోపాల్‌రాజు, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ వేద స్వరూప, ఈఓ నాగరాజు, వ్యవసాయ సలహా మండలి సభ్యులు మల్లికార్జున, వైస్ ఎంపీపీ పులికుక్క రాఘవేంద్ర, ఎంపీటీసీ వెంకటేష్ శెట్టి, సచివాలయ కో కన్వీనర్ రాఘవేంద్ర ఆచారి, నాయకులు గోరుకల్లు కృష్ణస్వామి, జనార్ధన్‌రెడ్డి, శివకుమార్, జగదీష్ స్వామి,వీరారెడ్డి, రామకృష్ణ, అబ్రహాం, ప్రభుదాస్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే జగనన్న ధ్యేయం

కౌతాళం: ప్రజా సమస్యలకు పరిష్కారమే జగనన్న సురక్ష కార్యక్రమం అని వైఎస్సార్‌సీపీ యువజన విభాగపు నాయకుడు ప్రదీప్‌రెడ్డి అన్నారు. మండలంలోని చూడి గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొని అర్హులకు ఎంపీపీ అమరేష్, నాయకులతో కలిసి ధ్రువ పత్రాలను అందజేశారు. ఆయన మాట్లాడుతూ పథకాలకు దూరంగా నిలిచిపోయిన అర్హులకు న్యాయం చేయాలనే ఉద్దేశంతో జగనన్న ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. అనంతరం దరఖాస్తుకున్న వారికి సర్టిఫికెట్లను అందజేశారు. లింగాలదిన్నెలో తహసీల్దారు రామేశ్వర్ రెడ్డి టీం గ్రామసభ నిర్వహించింది. కార్యక్రమంలో కోఆప్షన్ మెంబర్ మహబూబ్‌సాబ్, వైస్ ఎంపీపీ బుజ్జిస్వామి, చూడి సర్పంచ్ లక్ష్మి, లింగాలదిన్నె సర్పంచ్ వీరభద్రగౌడ్, ఎంపీడీఓ సుబ్బారాజు, నాయకులు, వెంకటరామిరెడ్డి, రమేష్, ఉచ్చప్ప, బసవరాజ్‌గౌడ్, ఆర్‌ఐ రాజశేఖర్, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థిని అభినందిస్తున్న దృశ్యం

కోసిగి: స్థానిక మౌంట్ కార్మెల్ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న రామకోటి ప్రసన్న బాబు, హనుమంతు రాష్ట్ర స్థాయి బాస్కెట్ బాల్‌లో పోటీల్లో ప్రతిభ చూపారని ప్రిన్సిపాల్ ఫాదర్ జాన్సన్ తెలిపారు. గురువారం పాఠశాల ఆవరణలో ప్రసన్న బాబును అభినందించారు. ఇటీవల గుంటూరులో జరిగిన జూనియర్ బాస్కెట్ బాల్ చాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొని విజేతగా నిలిచారని చెప్పారు. పీఈటీలు శేఖర్, పరుశురాం పాల్గొన్నారు.

సైబర్ నేరాల పట్ల జాగ్రత్తగా ఉండాలి

మంత్రాలయం రూరల్: సైబర్ నేరాల పట్ల పరజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ వేణుగోపాల్‌రాజు సూచించారు. గురువారం రాత్రి పల్లె నిద్ర కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని దళిత వీధిలో ప్రజలతో సమావేశమయ్యారు. బాల్య వివాహాలు, సైబర్ నేరాలు, సివిల్ సమస్యలు, దొంగతనాలు తదితర నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఎస్ఐ మాట్లాడుతూ చిన్న చిన్న సమస్యలకు ద్వేషం పెంచుకొని గొడవ పడొద్దని చెప్పారు. సమస్యలను తమ దృష్టికి తెస్తే పరిష్కారం చూపుతామన్నారు.

ఆర్థిక సాయం

ఆదోని టౌన్ : పట్టణంలోని 1వ వార్డు వాల్మీకినగర్‌కు చెందిన వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యకర్త నాగరాజు ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలయ్యాడు. ఇంటి వద్దనే ఉంటూ వైద్యం పొందుతున్నాడు. స్థానిక నాయకులు ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి, యువనేత మనోజ్‌కుమార్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో వారు రూ.10 వేలు సాయంగా అందజేయగా పట్టణాధ్యక్షుడు దేవా, కార్యకర్తలు ఆంధ్రా లక్ష్మన్న, మల్లి, సుధ, లక్ష్మన్న, షరీఫ్, కన్నా, మధు, శేషు, రామకృష్ణ గురువారం బాధితుడి ఇంటి వద్దకు వెళ్లి అందించారు.

సమస్యలను పరిష్కరించాలి

ఆదోని రూరల్ : పట్టణంలోని ఎంఎం కాలనీ, బండిమెట్ట, పర్వతాపురం, కల్లుబావి, మండిగిర ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని సీపీఎం పట్టణ కార్యదర్శి లక్ష్మన్న, నాయకులు గోపాల్, ముక్కన్న, వీరేష్, వెంకటేష్ కోరారు. గురువారం వారు సచివాలయ అధికారులకు వినతి పత్రాలు అందజేశారు. వారు మాట్లాడుతూ ఎంఎం కాలనీలోని పాత లైబ్రరీని పునః ప్రారంభించాలన్నారు. కల్లుబావిలో ఉన్న శ్మశాన వాటికకు రక్షణ గోడ ఏర్పాటు చేయాలని కోరారు.

ముస్తాబవుతున్న ప్రభుత్వాసుపత్రి



ఆదోని టౌన్ : పట్టణంలోని మాతా శిశు సంరక్షణ కేంద్రం 50 పడకలతో రోగులకు సేవలందిస్తోంది. అయితే పడకలు చాలక, డాక్టర్లు, సిబ్బంది వేధిస్తుండేది, మరో వైపు అరకొర వసతులుండేవి. ప్రభుత్వం నాడు-నేడు కార్యక్రమం కింద రోగులకు అనుగుణంగా మరో 50 పడకల నూతన భవనాన్ని ఎన్‌ఆర్‌హెచ్ఎం పథకం కింద రూ.10 కోట్లతో నిర్మించింది. అలాగే..ప్రస్తుతం వంద పడకలు ఉన్న ఏరియా ఆస్పత్రిలో రోగులకు బెడ్లు, మంచాలు చాలక ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో మరో వంద పడకల అత్యాధునిక వసతులతో కూడిన నూతన భవనాన్ని నిర్మించారు. రెండు నూతన భవనాలను ఈనెలాఖరు నాటికి సంబంధిత కాంట్రాక్టర్ ఆరోగ్యశాఖకు అప్పగించనున్నారు. భవనాలు స్వాధీనం చేసుకున్న వెంటనే ప్రారంభోత్సవానికి సిద్ధం చేస్తామని వైద్య ఆరోగ్య శాఖ అధికారులు తెలిపారు. పట్టణంలోని రెండు ప్రభుత్వ ఆస్పత్రులకు సంబంధించి 150 పడకల భవనాలు ప్రజా వినియోగంలోకి త్వరలోనే రానున్నాయి. ఖాళీగా ఉన్న వైద్యులు, సిబ్బంది పోస్టులు భర్తీ అయ్యాయి. దీంతో ఇక రోగులకు కార్పొరేట్ వైద్యానికి దీటుగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యం అందనుంది.

ఆదర్శ పాలనతో సుస్థిర స్థానం

- ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి
- జంపాపురం గ్రామంలో 'గడప గడపకు మన ప్రభుత్వం'



మహిళకు సంక్షేమ పథకాల బ్రోచర్ అందజేస్తున్న ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి



అర్హులకు ధ్రువ పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి

కోసిగి: సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదర్శవంతమైన పాలన సాగిస్తూ ప్రజల గుండెల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్నారని ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి పేర్కొన్నారు. గురువారం మండలంలోని జంపాపురం గ్రామ సచివాలయం పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరిగి పథకాల అమలు, చేకూరిన లబ్ధిని అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ ఇచ్చిన మాటకు కట్టుబడి నవరత్నాలతో పాటు మరిన్ని పథకాలను అమలు చేసి పేదల అభ్యున్నతికి కృషి చేస్తున్నారని కొనియాడారు. గ్రామంలో 29 రోడ్లు, డ్రైనేజీలు ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస రెడ్డి, నాడుగేని నరసింహులు, ఎంపీపీ ఈరన్న, సర్పంచ్ హారోన్ నాడుగేని నాగరాజు, జగదీష్ స్వామి, పీఆర్ ఏఈ యుగంధర్ రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మల్లికార్జున రెడ్డి, ట్రాన్స్‌కో ఏఈ వీరేష్, ఏపీఎం సత్యమ్మ, ఏపీఓ జయరాం పాల్గొన్నారు.

విద్యతోనే బంగారు భవిష్యత్

విద్యతోనే పిల్లలకు బంగారు భవిష్యత్ లభిస్తుందని, తల్లిదండ్రులు తమ పిల్లలను ఉన్నత చదువులు చదివించాలని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి సూచించారు. గురువారం జంపాపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు జగనన్న విద్యా కానుకలను అందజేశారు. అలాగే.. సజ్జలగుడ్డం గ్రామంలో రూ.17.05లక్షలతో నిర్మించి వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ను ప్రారంభించి డాక్టర్ అనురూప్‌తో కలిసి వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు.

జగనన్న సురక్షతో ప్రతి ఒక్కరికీ లబ్ధి

అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాలు అందజేయాలని సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జగనన్న సురక్ష పథకానికి శ్రీకారం చుట్టారని ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి పేర్కొన్నారు. గురువారం మండలంలోని జంపాపురం గ్రామంలో తహసీల్దార్ రుద్రగౌడ, కోసిగి సచివాలయం-3 ఎంపీడీఓ రాజేంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన జగన్న సురక్ష కార్యక్రమానికి హాజరైయ్యారు. గ్రామంలో 516 , కోసిగి సచివాలయం -3లో 287 సర్వీసులను పరిష్కరించి ధ్రువ పత్రాలు అందజేశారు.

జగ్జీవన్‌రామ్ ఆశయాలను సాధిద్దాం



జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి



మంత్రాలయంలో నివాళులర్పిస్తున్న జైభీమ్, ఎమ్మార్పీఎస్ నాయకులు

ఆదోని టౌన్ : దేశ తొలి ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ ఆశయాలను సాధిద్దామని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం జగ్జీవన్‌రామ్ వర్ధంతి సందర్భంగా స్థానిక తిమ్మారెడ్డి బస్టాండ్ సర్కిల్‌లోని బాబూ జగ్జీవన్‌రామ్ కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ కార్యాలయం నుంచి కార్యకర్తలు, నాయకులతో కలిసి ర్యాలీగా వెళ్లి ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ బడుగు, బలహీనవర్గాల కోసం ఆయన చేసిన పోరాటాలను కొనియాడారు. ఎమ్మెల్సీ డా.మధుసూదన్, చైర్‌పర్సన్ శాంత, పట్టణాధ్యక్షుడు దేవా, మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ తిమ్మప్ప, కార్పొరేషన్ల డైరెక్టర్‌లు మంజుల, రేణుక, శ్రీలక్ష్మి, నాయకురాళ్లు జిలేకాబీ శ్రీదేవి, శోభాలత, నాగలక్ష్మి, కౌన్సిలర్లు గోవిందు, మాధవరెడ్డి పాల్గొన్నారు.

ఆదోని సెంట్రల్ : బాబు జగ్జీవన్ రామ్ పేద ప్రజల గుండెల్లో సుస్థిర స్థానాన్ని సంపాదించుకొన్నాడని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ బాధ్యుడు దేవిశెట్టి ప్రకాశ్, కర్నూలు జిల్లా మైనార్టీ చైర్మెన్ ఎండి.నూర్ తెలిపారు. పట్టణంలోని తిమ్మారెడ్డి బస్టాండ్‌లో జగ్జీవన్ రామ్ వర్ధంతిని పురస్కరించుకొని విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన సేవలను కొనియాడారు. పార్టీ ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి తాయన్న, మైనార్టీ సెల్ ఆదోని ఉపాధ్యక్షుడు హుసేన్ బాషా, మండల అధ్యక్షుడు నెట్టేకల్ హనుమంతు,నాగరాజ్ పాల్గొన్నారు.

పెద్దకడబూరు : బాబూ జగ్జీవన్ రామ్ వర్ధంతిని ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో స్థానిక మారెమ్మ ఆలయ ఆవరణలో గురువారం జరుపుకున్నారు. ఎమ్మార్పీఎస్ నాయకులు తిక్కన్న, బజారి, సుధాకర్, ప్రభాకర్ ముందుగా ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళలర్పించారు. వారు మాట్లాడుతూ అణగారిన కులాల అభివృద్ధి, చట్ట శాసనకర్తగా, పరిపాలనదక్షుడిగా, నమ్మిన సిద్ధాంతాల కోసం కృషి చేసిన మహనీయుడని కొనియాడారు.

మంత్రాలయం రూరల్: దళితుల అభివృద్ధికి జగ్జీవన్‌రామ్ చేసిన కృషి ఎనలేనిదని జైభీమ్ ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి గర్జి హనుమన్న పేర్కొన్నారు. గురువారం జగ్జీవన్‌రామ్ వర్ధంతి సందర్భంగా పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఎదుటనున్న ఆయన విగ్రహానికి ప్రజా సంఘాలు, జైభీమ్ ఎమ్మార్పీఎస్ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

విజయవంతం చేయండి

ఆదోని రూరల్ : ఈనెల 15వ తేదీన ఆదోనిలో చేపట్టే మహాసభకు మాదిగ కులస్తులు తరలివచ్చి విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ ఎస్.సుభాష్‌చంద్రబోస్ మాదిగ, మండలాధ్యక్షుడు బండారి గిడ్డయ్య, పట్టణ అధ్యక్షుడు గుమ్మల బాలస్వామి పిలుపునిచ్చారు. గురువారం వారు సభకు సంబంధించిన కరపత్రాలను స్థానిక మున్సిపల్ క్రీడా మైదానంలో విడుదల చేశారు. వారు మాట్లాడుతూ సభకు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ హాజరవుతారని చెప్పారు.

స్థానికులకే బాధ్యతలు అప్పగించాలి

ఆదోని సెంట్రల్: వసతి గృహాల సంరక్షకులుగా స్థానికులను నియమించాలని డెమోక్రటిక్ స్టూడెంట్స్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ఆర్ట్స్ అండ్ సైన్సు కళాశాల ఎదుట వసతి గృహాల డైరెక్టర్ దిష్టి బొమ్మను దహనం చేశారు. ఆయన మాట్లాడుతూ వసతి గృహ సంరక్షకులుగా పని చేస్తున్న వారు దూర ప్రాంతాల నుంచి వచ్చి పోతుండటంతో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందడం లేదన్నారు. డీఎస్ఎఫ్ జిల్లా ఉపాధక్షుడు డి.ఉదయ్, నాయకులు ప్రదీప్, అరవింద్, సురేష్, ఉదయ్, హరికృష్ణ పాల్గొన్నారు.

ఎస్ఎస్ ట్యాంకు పరిశీలన

ఆదోని రూరల్: మండలంలోని హానవాల్ గ్రామంలో అడుగంటిన ఎస్ఎస్ ట్యాంకును గురువారం సీపీఎం మండల కార్యదర్శి కె.లింగన్న, నాయకుడు పి.బాషా పరిశీలించారు. వారు మాట్లాడుతూ హానవాల్, జి.హొసళ్లి, కడితోట, కౌతాళం గ్రామాలకు తాగునీటిని సరఫరా చేసే హానవాల్ ఎస్ఎస్ ట్యాంకు అడుగంటిపోయిందని, ఆయా గ్రామాల్లో తీవ్రమైన తాగునీటి ఎద్దడి మొదలైందన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ముందు జాగ్రత్తగా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని కోరారు. నాయకులు దస్తగిరిబాషా, అబ్దుల్‌రహీం, పాండు పాల్గొన్నారు.

విద్యా మాఫియాను అరికట్టాలి

ఆదోని అర్బన్: విద్యా మాఫియాను అరికట్టాలని బీజేవైఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్ ఆచారి, పట్టణ అధ్యక్షుడు శ్రీకాంత్ అన్నారు. గురువారం స్థానిక బీజేపీ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు.ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లు కొన్ని మాఫియాగా తయారై జీవో నంబర్ 1ని తుంగలో తొక్కుతూ ఇష్టానుసారంగా ఫీజులు, బుక్స్, డ్రెస్సులకు అధిక మొత్తంలో వసూలు చేస్తున్నాయన్నారు. ఆదోనిలోని భాష్యం-02 బ్రాంచ్‌కు ఎలాంటి అనుమతి లేకపోయినా ఎంఈఓ పట్టించుకోకపోవడం సరికాదన్నారు. బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్ష కార్యదర్శి అంజయ్‌కుమార్, వులిద్రిమోహన్, సంజయ్‌పాండే పాల్గొన్నారు.

ఆశలు గల్లంతు

- మీనాక్షినాయుడుని బలపరిచిన టీడీపీ జిల్లా అధ్యక్షుడు
- గుడిసె కృష్ణమ్మ, దేవేంద్రప్ప, భాస్కర్‌రెడ్డి, రవూఫ్‌ల ఆశలు అడియాశలు
- చంద్రబాబు, లోకేష్, అచ్చెంనాయుడు చుట్టూ ప్రదక్షిణలు చేసినా దక్కని ఆశీస్సులు

ఆదోని అర్బన్: టీడీపీ మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు బంధుప్రీతితో వచ్చిన సమస్య వల్ల టీడీపీలో రెండు వర్గాలు ఏర్పడ్డాయి. ఒక వర్గంలో మీనాక్షినాయుడు ఉంటే రెండో వర్గంలో గుడిసె క్రిష్టమ్మ, దేవేంద్రప్ప, భాస్కర్‌రెడ్డి, రవూఫ్ ఉన్నారు. కొన్ని రోజులుగా రెండో వర్గం వారు మా నలుగురిలో ఏ ఒక్కరికి ఆదోని అసెంబ్లీ సీటు ఇచ్చినా గెలిపించుకుంటామని మాజీ సీఎం చంద్రబాబునాయుడు, యువనేత లోకేష్, రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెంనాయుడు చుట్టూ ప్రదక్షిణ చేశారు. వారు చూద్దామని సమాధానమివ్వడంతో తమలో ఎవరో ఒకరికి సీటు దక్కుతుందని ఆశగా ఉన్నారు. అయితే గురువారం టీడీపీ బస్సు యాత్ర చాగి నుంచి ఆదోని వరకు సాగింది. స్థానిక పాత బస్టాండ్ కూడలిలో అంబేడ్కర్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన సభలో టీడీపీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు బీటీ నాయుడు, మాజీ కేంద్ర మంత్రి కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి, మాజీ మంత్రులు కేఈ ప్రభాకర్, నాయకులు తిక్కారెడ్డి, సోమిశెట్టి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ఆదోనిలో మీనాక్షినాయుడిని ఎమ్మెల్యేగా గెలిపించాలని కార్యకర్తలను కోరారు. దీంతో రెండో వర్గంలోని గుడిసెక్రిష్ణమ్మ, భాస్కర్‌రెడ్డి, దేవేంద్రప్ప, రంగస్వామి, రావూఫ్, రామచంద్ర ముఖాల్లో కళ తప్పింది. ఇప్పటి వరకు ఎమ్మెల్యే టికెట్ ఇస్తారనే వారి ఆశలు అడిఆశలయ్యాయి. దీంతో వీరి పయనం ఎటువైపోననే చర్చ కొనసాగుతోంది.

మసీదు అభివృద్ధికి విరాళం

కౌతాళం: స్థానిక ముల్లారు మసీదు అభివృద్ధికి రూ. 30వేల విరాళాన్ని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ప్రహ్లాదాచారి అందజేశారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో మసీదు నిర్వాహకులు రాజ్‌అహ్మద్, వాహిద్, ముల్లార్‌బాషాకు ఈ మొత్తాన్ని అందజేశారు. సర్పంచ్ పాల్‌దినకర్, ఉప సర్పంచ్ తిక్కయ్య, వైస్ ఎంపీపీ బుజ్జిస్వామి, మాజీ సర్పంచ్ అవతారం, మాజీ ఎంపీటీసీ చౌదరిబసవ పాల్గొన్నారు.